# మనిషి

కోడూరి శ్రీరామమూర్తి



వాచీ చూసుకుంటూ విసుక్కున్నాడు రంగనాథం ఎంతసేపీ నిరీక్షణ?—

నిజమే-ఇవాళ అతని హృదయం విరహోత్కంఠితలాగానే వుంది. బండి యింకా ఆలస్యమయితే తను వెళ్ళేపని వృథాయే కావచ్చు. రాజశేఖరం బెజవాడ నుంచి వెళ్ళిపోయిన తరువాత తను అక్కడికి వెళ్ళి మాత్రం చేయగలిగింది ఏముంది?- అసలీ బండి యివాళే లేటుగా రావాలా? "నువ్వెక్కదల్చుకున్న బండి జీవితకాలం లేటు—" అన్న ఆర్ద్ర మాటలు జ్ఞాపకం వచ్చాయి. ప్చ్! యిప్పుడిలాంటి సూక్తులు జ్ఞాపకం రాకుండావుంటే బాగుణ్ణు.

ప్లాట్‌ఫారం మీద వున్న పాన్ షాపులో సిగరెట్ తీసుకుని హిగిన్‌బాదమ్స్ వేపు దారితీశాడు రంగనాథం.

శ్రీ శ్రీ శ్రీ రాజశేఖరం!

హిగిన్‌బాదమ్స్‌లో వున్న ఓ పత్రిక అట్టమీద నవ్వుతూ కనబడుతున్నాడు రాజమాన్య రాజపూజితుడైన రాజశేఖరం. ఆ పత్రిక ముఖచిత్రాన్ని పరీక్షగా చూస్తూ రంగనాథం- మనిషి జీవితంలో విధి ఎలాంటి పాత్ర వహిస్తుందీ అనుకుంటూ సన్నగా నిట్టూర్చాడు.

చదువుకొనే రోజుల్లో రాజశేఖరాన్ని ఎవరూ ప్రయోజకుడిగా భావించలేదు. కాలేజి మానేసి రోడ్డుమీద తిరిగే రాజశేఖరాన్ని చూచి యింట్లో వాళ్ళు "చెడబుట్టాడు" అనుకుంటే- చుట్టపక్కాలు "ఎందుకీ వెర్రి" అనుకున్నారు. నలుగురితోపాటు జైలు కెళ్ళినప్పుడూ- వళ్ళు హూనమయ్యేలా లాఠీ దెబ్బలు తిన్నప్పుడూ రాజశేఖరం ఏమనుకున్నాడో గాని- ఊళ్ళో మాత్రం "దేశం మీద తిరుగుతున్నా"డని కొందరూ- "దేశం కోసం తిరుగుతున్నా"డని కొందరు వ్యాఖ్యానాలు చేశారు.

తనకు దూరంగా ఉన్న కొడుకుని తలుచుకుని రాజశేఖరం తండ్రి, బుద్ధిగా చదువుకుంటున్న రంగనాథాన్ని చూచినప్పుడల్లా "రంగా!-నువ్వు ప్రయోజకుడివి. నువ్వు డిప్టీ కలెక్టరై మీ నాన్న పేరు నిలబెడతావు."అని కళ్ళనీళ్ళు పెట్టుకొనేవాడు. ఆయన అనేట్టుగా రంగనాథం ప్రయోజకుడు అవునో. కాదో.-కాని బుద్ధిగా బి. ఏ. డిగ్రీని పుచ్చుకొని ప్రభుత్వ నౌకరీలో స్థిరపడే నాటికి భారతదేశానికి స్వాతంత్ర్యం రావటమూ. రాజశేఖరానికి అసెంబ్లీ సభ్యత్వం రావడమూ జరిగిపోయాయి. అతి ప్రయాసమీద రంగనాథం జీవిత సోపానాలు ఎక్కుతుండేసరికి రాజశేఖరం మంత్రివర్యుడిగా ముద్ర వేసుకున్నాడు.

రాజశేఖరం బొమ్మ చూస్తూ- "రాజూ! నువ్వే నిజమైన ప్రయోజకుడివి-" అస్పష్టంగా-గొణుక్కున్నాడు రంగనాథం.

ఆలోచనలలో ఉన్న రంగనాథానికి కొద్ది దూరంలో ప్లాట్‌ఫారమ్‌మీద ఉన్న ఓ స్త్రీమూర్తి కనబడింది.

కనకలత!-

వళ్ళు ఝల్లుమంది. తనని పలుకరించదు కదా నెల్లాళ్ళ క్రితం కాకినాడలో......దిల్ బహార్ హోటల్‌లో.. ఛ!- ఛ!-ఇప్పుడావిడ తనని పలకరించిందంటే ఏమైపోవాలి?- ఊళ్ళో తన గౌరవం—అంతస్థు—అల్లరిపాలై పోదూ!— తన "ప్రఖ్యాతి" ఇంకా...అయినా. ఆనాటి తన ముఖాన్ని కనకలత ఇంకా జ్ఞాపకముంచుకుంటుందా?-ఎందుకు జ్ఞాపకం ఉంచుకోదు?- కళాకారులంటే తనకి బాగా అభిమానమనీ ..మీరు వేసే చిత్రాలంటే బాగా ఇష్టమనీ... చాలా వాగింది కదా - అయినా, తనకున్న ఉద్యోగం సామాన్యమైందా మరచిపోడానికి?- ఇంక, ఆలోచించుకోలేకపోయాడు రంగనాథం. మొహం తిప్పుకుని గబగబా రిఫ్రెష్‌మెంట్ రూమ్‌లో దూరిపోయాడు.

•

ప్లాట్‌ఫారమ్ మీదనుంచి ఎక్స్‌ప్రెస్ కదులుతూండగా తేలిగ్గా నిశ్వసించాడు రంగనాథం. గ్లాస్ షట్టర్స్‌ను పైకితేస్తూ-కదులుతున్న ప్రకృతిని చూస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు రంగనాథం

రంగనాథం కళాకారుడు నిజమే చక్కగా చిత్రాలు గీస్తాడన్నదికూడా నిజమే అయినంత మాత్రాన అతడికి సహజమైన బలహీనతలు ఉండకూడదని ఎక్కడుంది?-

"అవును- ఎక్కడుంది?-" అంటూ గొణుక్కున్నాడు రంగనాథం సిగరెట్ ముట్టిస్తూ

ఛ!- ఛ!- యింక తను ఆ విషయం ఆలోచించకూడదు. మనస్సుకు పగ్గాలువేశాడు రంగనాథం. రంగనాథం వేసిన పగ్గాలను విడదీసుకుని విశృంఖల విహారం చేస్తానంటోంది మనస్సు.

ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్ ఖాళీగా ఉంది. "రిజర్వు చేయించుకున్న"ట్టుగా తనొక్కడే ఉన్నాడు కంపార్ట్‌మెంట్‌లో. బెర్త్‌మీద పడుకుని మళ్ళీ దీర్ఘాలోచనలో పడ్డాడు రంగనాథం

రాజశేఖరం తన విషయాన్ని సానుభూతితో అర్థం చేసుకుంటాడా?- అసలు రాజశేఖరాన్ని కలవడమంటేనే భయంగావుంది తనకి అతనితో ఎలా మాట్లాడాలి? ఏమని మాట్లాడాలి?- తన

# మనిషి

పెదిమలు బలహీనంగా వణకుతున్నాయి. చిన్నతనంలో స్కూలు ఎగ్గొట్టి పైలా పచ్చీసుగా తోటల్లో తనతో తిరిగిన స్నేహితుడి దగ్గర తను ఈ విషయం ఎలా ప్రారంభించగలడు? - అసలెలా సంభాషణ ప్రారంభించాలి? - బహుశా ఈ విషయం ఈ పాటికే అతడి దృష్టికి వచ్చి ఉంటుంది. తనని చూడగానే ముఖం తిప్పుకుని "మాట్లాడడానికి ఖాళీలేదు—" అంటాడా." "నీతో యిప్పుడు మాట్లాడడం మంచిదికాదు-" అంటాడా. ఏ విధంగానూ ఆలోచించుకోలేక తల పట్టుకున్నాడు రంగనాథం. కణతలు ఆలోచనా భారంతో పగిలిపోతున్నాయి. బాధగా కను రెప్పలు మూసుకున్నాడు.

కుచేలుడు జ్ఞాపకం వచ్చాడు.

ఎప్పటి పురాణ కథ. అయినా - కుచేలుడు చాలా మంచివాడు. తను అలాంటివాడు కాదు.

కాని మేధ ఎదురు తిరిగింది. ఏం?- తను మంచివాడు కాదా?—

మనస్సు గట్టిగా సమాధానం చెప్పింది "మరి నువ్వు మంచివాడవయితే ..ఆవాళ ఇలా చిన్నబుచ్చుకుని రాజశేఖరం దగ్గిర కెళ్ళాల్సిన అవసరం ఏం వొచ్చింది?. మేధ మాట్లాడ లేదు. "ఓడిపోయావ్ లే" అంటూ మనస్సు చప్పట్లు చరిచింది. "ఊఁ!." అంటూ బాధగా మెదడు మూలిగింది.

మళ్ళీ మేధ పనిచేయడం ప్రారంభించింది. రాజశేఖరం యివ్వాళంటే మంత్రి అయ్యాడు. కాని చిన్నతనంలో అతనికి ముఖ్య మిత్రుడు. ప్రాణంలో ప్రాణమైన స్నేహితుడు. స్నేహితుడి కోసం ఆ మాత్రం సహాయం చెయ్యలేడా?— విజ్ఞానికది - అతగాడి ధర్మంకాదా?—

తేలిగ్గా నిట్టూర్చాడు రంగనాథం.

తనకి రాజశేఖరం బాగా తెలుసు. అతని విషయంలో అపోహలకు తావులేదు. తనని చూడగానే ఆప్యాయంగా పలుకరిస్తాడు. "అవును - యిదివరకే విన్నాను." అంటూ సానుభూతిగా తన బాధను అర్థంచేసుకుంటాడు. "నేనున్నానుగా. నీకేం భయంలేదు." అంటూ అభయ హస్త మిస్తాడు.

అవును - రాజు అలాంటివాడే.

రంగనాథం హృదయం బాగా తేలికయిపోయింది. ఆ క్షణంలో రంగనాథం కళ్ళకి రాజు మూర్తీభవించిన దేవుడిలా కనబడ్డాడు.

ఆలోచనలలో ఉన్న రంగనాథం హఠాత్తుగా తలుపు దగ్గిర చప్పుడు విని ఈ లోకంలో పడ్డాడు. ఎవరో ఒకవ్యక్తి తటాలున లోపలికి వచ్చాడు. రైలు ఇంతవేగంగా వెళ్ళిపోతూంటే లోపలికి ఎలా రాగలిగాడు? -

ఆశ్చర్యంగా శబ్దం వచ్చినవేపు చూస్తున్నాడు రంగనాథం. మాసిపోయినగెడ్డం. ఆకుపచ్చ రంగు టెరిలిన్ బుష్‌కోటు. మాసిపోయిన కాటన్ పేంటు. చెదిరిపోయిన జుట్టు. విచిత్రంగా ఉన్నాడావ్యక్తి. ఒగురుస్తూ ముఖాన్న పట్టిన స్వేదాన్ని తుడుచుకుంటున్నాడు.

లోపలికొచ్చిన ఆ వ్యక్తి రంగనాథాన్ని చూచి ఒక క్షణం ఆశ్చర్యపోయాడు. ఆ తర్వాత. తన్ని తాను తమాయించుకుంటూ.

"క్షమించాలి. నెక్స్ట్ స్టేషన్‌లో దిగిపోతాను. అన్నాడు.

రంగనాథం మాట్లాడబోయాడు.

"మీరడిగే ప్రశ్న నాకు తెలుసు. ప్రక్కన థర్డ్ క్లాసు కంపార్ట్‌మెంట్ చాలా రద్దీగా ఉంది నుంచోడానికికూడా స్థలం లేదు. అంచేత అందు లోంచి ఇక్కడికి వచ్చేశాను - ఇక్కడ ఎవరూ లేరనుకొని......"

రైలు నడుస్తూండగానే లోపలికి వచ్చిన అతడిని చూస్తే రంగనాథానికి ఏవో పాతకేసులు జ్ఞాపకం వచ్చాయి. అయినా, ఏమీ మాట్లాడకుండా ఊరుకున్నాడు.

అగంతకుడు నుదుటిమీద పడుతున్న జుట్టును పైకి తోసుకుంటూ మౌనంగా సిగరెట్ వెలిగించు కుంటున్నాడు.

ఆవేశల్లో-అదేముక్కు-ఎక్కడో చూసినట్టనిపించింది రంగనాథానికి. చేతల్లో ధైర్యం - మాటల్లో నిర్లక్ష్యం. ఎవరో జ్ఞాపకం వచ్చారు.

విశ్వమూర్తి!. తన బాల్య స్నేహితుడు విశ్వమూర్తి.

ఒక్కసారిగా జ్ఞాపకాల పుటలు వెనక్కు తిరిగాయి. తనూ-విశ్వం-నాయుడుగారి చెరకుతోట-పొట్టిపంతులు మాష్టారు-తన బాల్యమంతా ఒక్కసారి సినిమా రీల్లా తిరిగినట్లనిపించింది.

ఈ అగంతకుడు విశ్వమూర్తి కాగలడా?- నమ్మలేకపోయాడు రంగనాథం. తాసిల్దార్ గారి అబ్బాయి విశ్వమూర్తి ఇలా వుండగలడా?-తన కళ్ళు అబద్ధం చెబుతున్నట్టనిపించింది రంగనాథానికి.

తలుపు కానుకుని సిగరెట్ త్రాగుతున్న అగంతకుడు రంగనాథాన్ని పరీక్షగా చూస్తూ-

"మీరు...మీరు..."అన్నాడు.

"అవును. నేను?-" ఎదురుప్రశ్న వేశాడు రంగనాథం.

"క్షమించాలి. మీ పేరు తెలుసుకోవచ్చా?-" చాలా నమ్రతగా అడుగుతున్నాడు అగంతకుడు.

రంగనాథం ఊహ నిజమే అయింది. ఆ అగంతకుడు నిజంగా విశ్వమూర్తే. "ఆశ్చర్యాలు" పూర్తయినతర్వాత.

తనప్రక్కన కూర్చొబెడుతూ విశ్వమూర్తితో అన్నాడు రంగనాథం-

"ఇంతకీ యిప్పుడేం చేస్తున్నట్టూ?."

"చేయడానికేం తనబట్టంలేదు. అదే ప్రయత్నం-"

చాలా నిర్లక్ష్యంగా నవ్వాడు విశ్వమూర్తి. సిగరెట్ పొగ వదులుతూ.

అదే నవ్వు. అదే నిర్లక్ష్యం. అదే విశ్వమూర్తి.

చిన్నతనంలో విశ్వమూర్తిని చూచి ఊళ్ళో అంతా మురిసిపోయేవారు. తాసిల్దారుగారబ్బాయి పైగా పాతిక ఎకరాలమాగాణికి వారసుడు. చూడచక్కటి రూపున్నవాడు. జీవితంలో అదృష్టం అనేమాటకు అర్థం 'విశ్వమూర్తి" అనుకునేవారు. చిన్నప్పుడు తను శని, ఆదివారాలు వచ్చాయంటే రోజులో చాలాభాగం విశ్వమూర్తి యింట్లోనే వుండేవాడు. విశ్వమూర్తితల్లి ఒక్కొక్కప్పుడు తనని వాళ్ళింట్లోనే భోజనానికి వుండమనేది. రాజశేఖరంకూడా తనకు చిన్ననాటినుంచీ క్లాస్‌మేట్ అయినప్పటికీ- అతడితో సన్నిహిత సంబంధం ఏర్పడ్డది హైస్కూల్లో చదువుకునే రోజుల్లోనే. అసరికి విశ్వమూర్తి తండ్రిగారికి ట్రాన్స్‌ఫరై ఊరు మారిపోవడం జరిగింది.


## ఆర్యన్ వారి

**కళ్యాణి :** గర్భవాతముతో బాధపడు స్త్రీలకు ఆరోగ్యము, సంతాన సౌభాగ్య ప్రాప్తి నొసగు టానిక్.

**అమృతవల్లి సారస :** రక్తమును శుద్ధిచేయుటానిక్, స్త్రీ పురుషులు అన్ని ఋతువులలోను సేవించవచ్చును.

తయారుచేయువారు :

ఆర్యన్ డ్రగ్గు కంపెనీ-తణుకు,

అన్ని మందులషాపులలో దొరకును. A.P.



## ఫోల్డింగ్ 50 షాట్ పిస్టల్

లైసెన్సు అక్కరలేదు. అమెరికన్ మోడల్. దొంగలు, క్రూరమృగముల నుండి రక్షించుకోండి. ఉల్లాస ప్రయాణాలు, యాత్రలు, నాటకాలకు ప్రశస్తమైనది. ఆటోమేటిక్ 50 షాట్లు ఏర్పాటు గలది. తేలికైనది. ఇందునుండి వెలువడు నిప్పు




రవ్వలు మిమ్ములను కాపాడును. ధర : 50 షాట్లు: జర్మన్ మోడల్ నెం. 99 రు. 15/50. వి.పి.ఛార్జీలు రు. 2/50 లెదర్ కేస్ రు. 7/- అదనపు షాట్లు 100 కి రు. 5/-

M/s. GEMS ARTS (AJV-15)
P. BOX 1325, Delhi

చిన్న విశ్వమూర్తి పుట్టినరోజు పండుగలు ఈనాటికీ తనకు జ్ఞాపకంవున్నాయి. పుట్టినరోజు నాటి విశ్వమూర్తి వైభవాన్ని చూచినప్పుడు మనసులో ఏదో తెలియని బాధ పులుముకొనేది. పండుగలకు క్రొత్తబట్టలు కూడా కొనలేని తనతండ్రి బీదరికాన్ని తలచుకొని "పుడితే విశ్వమూర్తిలా అదృష్టవంతుడిగానే పుట్టాలి—" అని తన దురదృష్టాన్ని నిందించుకొనేవాడు. అలాంటిది. ఆ విశ్వమూర్తేనా ఇలా కనబడుతున్నది?

ఆ చిననాటి "అదృష్టవంతుడు" ఈ నాడు సరి అయిన ఆధారంలేక - విద్యార్హతలు లేక — "దురదృష్టవంతుడు"గా చెలామణీ అవుతున్నాడని తెలుసుకోడానికి రంగనాథానికి ఎంతో సేపు పట్ట లేదు.

ఇంతలో విడవోలు స్టేషన్ వచ్చింది. బండి ప్లాటుఫారమ్‌మీద ఆగుతూండగానే విశ్వమూర్తి గబగబా తలుపు దగ్గరకు వెళ్ళాడు. అంతలోనే వెనక్కు వచ్చాడు.

"రంగా!- వాళ్ళొచ్చేస్తున్నారు. ఈ బాత్ రూమ్‌లో దాక్కుంటాను. వాళ్ళడిగితే ఇక్కడికెవరూ రాలేదని చెప్పు. నువ్వు చెబితే వాళ్ళు తప్పకుండా నమ్ముతారు." భయంతో ఒగురుస్తున్నాడు విశ్వమూర్తి. రంగనాథంనించి సమాధానం రాకుండానే బాత్ రూమ్‌లో దూరి తలుపేసుకున్నాడు.

వాళ్ళెవరు?-

తలుపువేపు చూశాడు. రైల్వే పోలీసులు!- పోలీస్ సూపరెంటెంట్ రంగనాథాన్ని చూడగానే వాళ్ళు సెల్యూట్ చేస్తూ-

"గుడ్ మార్నింగ్‌సర్ - పిక్ పాకెటర్ ఇటు వేపు వచ్చినట్టుంది. మీ కంపార్ట్‌మెంట్‌లోగాని దూరాడా?-" అన్నారు.

పోలీస్ సూపరెంటెంట్‌ను అడగకూడని ప్రశ్న అయినప్పటికీ అడగక తప్పటంలేదు రైల్వే పోలీసులకు.

అర్థమైంది రంగనాథానికి, చివరకి ఇంతకు దిగజారాడా విశ్వమూర్తి?

అయితే, ఇప్పుడు తన కర్తవ్యం ఏమిటి?- విశ్వమూర్తి చిన్నతనంలోనే నీ ప్రాణ స్నేహితుడు అతడిని రక్షించడం నీ ప్రథమ కర్తవ్యం — మనస్సు గోల పెట్టింది కాని మెదడు గట్టిగా ప్రతిఘటించింది. "బాల్య స్నేహితుడని అతడిని రక్షించబూనుకుంటే ఆ తర్వాత అతగాడు నీ కంపార్ట్‌మెంటులోనే దాక్కున్నాడని రుజువు అయితే నీ భవిష్యత్తేం కావాలి? దోషిని రక్షించబోయిన నువ్వుకూడా చట్టం దృష్టిలో దోషివే అవుతావు. ఇంతలో విశ్వమూర్తి ఆ డబ్బు ఏ అమాయకుడి జేబులోంచి కొట్టేశాడో?. ఛీ. ఛీ! ఇలాంటివాడు నీ చిన్ననాటి స్నేహితుడని చెప్పుకోవడమే అసహ్యం. ఇప్పుడు నువ్వు రక్షించినంతమాత్రాన మళ్ళీ యిలాంటి తప్పు చెయ్యడన్న నమ్మకం ఏమిటి? పైగా నీ భరోసా చూసుకుని మరీ విజృంభిస్తాడు. ఇలాంటి మనుషుల్ని ముందుగా శిక్షించడమే మంచిది.- మేధ గట్టిగా హెచ్చరించింది. "అవునవును" అంటూ రంగనాథం వంతపాడాడు.

రంగనాథం చెప్పిన తరువాత బాత్ రూమ్ లోంచి విశ్వమూర్తిని రెక్కలు పట్టుకొని పోలీసులు లాక్కెడుతూంటే - అతడు కన్నీళ్ళు తిరుగుతున్న కళ్ళతో రంగనాథంవైపు తీక్షణంగా చూశాడు. ఆ చూపునకు రంగనాథం తట్టుకోలేకపోయాడు. తలదించుకున్నాడు.

విశ్వమూర్తి పెనుగులాడుతూంటే పోలీసులు అతణ్ణి లాఠీలతో కొడుతున్నారు.

రంగనాథం గుండెలు పిండేసినట్టయింది. విశ్వమూర్తి చూపులు తన మనసులో ప్రళయ తాండవం చేశాయి. ఆ చూపుల్లో ఎన్ని భావాలు! ఎన్ని ఆవేదనలు! -

తను ఎంత క్రూరంగా ప్రవర్తించాడు?- బాధగా తలపట్టుకున్నాడు. ఈ విశ్వమూర్తి తనకి కనపడకపోతే బావుండేది. తను ఈ పోలీసు ఉద్యోగంలో చేరకపోతే బావుండేది. తను పోలీసు అధికారి కానట్టయితే ధైర్యంచేసి విశ్వమూర్తి బాత్‌రూమ్‌లో దాక్కునేవాడు కాదు. గుండెలు కెలికినట్టయింది.

మనసు గట్టిగా ఎదురు తిరిగింది.

విశ్వమూర్తిని శిక్షించే అధికారం నీ కెక్కడిది? - నువ్వెవరు? - ఉద్రిక్తతతో గర్జించింది.

"అవును - నేనెవరిని? -" బాధగా గుండె అదుముకుంటూ గొణుక్కున్నాడు రంగనాథం.

"నువ్వు విశ్వమూర్తిని మించిన దొంగవి. విశ్వమూర్తి చేసిన పాపానికి శిక్ష పడబోతూంది. కాని - నువ్వు పాపాన్నుంచి పారిపోదామని చూస్తున్నావు. శిక్ష పడకూడదని విశ్వప్రయత్నం చేస్తున్నావు." ఉద్రేకంతో అరుస్తోంది మనస్సు.

"నేను దొంగనెలా అవుతాను?-" ఎదురు తిరిగాడు రంగనాథం.

"లంచం పట్టడం నేరంకాదా?. "కరప్షన్" కేసు ప్రభుత్వ పరిశీలనలో వుంది. దానినుంచి బయటపడదామని అడ్డుతోవలు తొక్కడం నేరం కాదా?- లంచం తిని దొంగల్ని రక్షించిన నువ్వు దొంగవికాక మరేమవుతావు?- ఇవ్వాళ- విశ్వమూర్తిని రక్షించడానికి నీకు ఎక్కడలేని ధర్మం అడ్డొచ్చింది. అదే ధర్మం రాజశేఖరానికి అడ్డొస్తే నువ్వే మవుతావు?- దొంగ నీ స్నేహితుడనుకోడానికి నీకెంత తలవంపో-ఒక లంచగొండి తన స్నేహితుడని చెప్పుకోవడం రాజశేఖరానికికూడా అంత తలవంపే. నీకు శిక్ష పడక తప్పదు. "కరప్షన్" కేసు త్వరలోనే ఋజువవుతుంది. నీకు అధికార భ్రష్టత జరుగుతుంది." మనస్సు వికటాట్టహాసం చేసింది.

రంగనాథానికి వళ్ళంతా చెమటలు పట్టేశాయి. నిజమే. రాజశేఖరంకూడా ఇలా అనుకుంటే తన బ్రతుకేం కావాలి?- విశ్వమూర్తి స్థానంలో తను వున్నట్టూ- తన స్థానంలో రాజశేఖరం వున్నట్టూ అనిపించింది.

విశ్వమూర్తి చూపులు భయంకరంగా కళ్ళ ముందు కదలాడసాగాయి.

వాచీ చూసుకున్నాడు.-యింజన్‌కు వాటరింగ్ జరుగుతోంది. ఇంకా టైముంది. ఒకసారి రైల్వే పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి విశ్వమూర్తిని కలుసుకుని క్షమార్పణ కోరుకుందామనిపించింది రంగనాథానికి. మనసు ఒక్క క్షణంకూడా ఉండబట్ట లేదు.

గబగబా కంపార్టుమెంట్ దిగి రైల్వే పోలీస్ స్టేషన్ దిశగా నడిచాడు రంగనాథం.

పోలీసు సూపరెంటెంట్‌ని చూడగానే ఇన్‌స్పెక్టర్ లేచి నిలబడ్డాడు.

"సారీ సర్!- మీకు ఇన్‌కన్వీనియన్స్ జరిగింది. వాడిని ఇప్పుడే లాకప్‌లో పెట్టాం. ఇలాంటి వాళ్ళవల్ల మీకు డిస్టర్బెన్స్.-" రైల్వే యిన్‌స్పెక్టర్ ఎంతో వినయంగా చెబుతున్నాడు.

రంగనాథం ఏదో మాటాడదామనుకున్నాడు గాని- ఏదీమాట్లాడలేకపోయాడు. మౌనంగా తలదించుకొని ఖైదీలుండే "సెల్" వైపు చూద్దామనుకొని చూసే ధైర్యం లేక- బరువెక్కిన హృదయంతో తిరిగి ప్లాట్ ఫారము మీదకు వచ్చాడు.

ఇంతలో ప్లాట్‌ఫారమ్ మీద గంట మ్రోగింది. గార్డు పచ్చజెండా ఊపుతున్నాడు. రైలుబండి మెల్లగా కదులుతోంది. త్వరగా వెళ్ళి- పరిగెట్టి నీ కంపార్ట్‌మెంట్‌లో ఎక్కు- అంటూ మేధ తొందర పెడుతోంది.

రంగనాథం అతగాడిమాటలు వినదలచుకో లేదు.

దూరంగా కనకలత ప్లాట్ ఫారంమీద కనబడింది. ఇటువేపే వస్తోంది. ఆమె కూడా ఈ స్టేషన్‌లోనే దిగింది కాబోలు.

త్వరలో ప్రారంభం!
శ్రీమతి కోమలాదేవిగారి
కొత్త సీరియల్
'ఉన్నత శిఖరాలు'
తేదీకై నిరీక్షించండి